యూరియా కోసం రైతుల తిప్పలు

- తెల్లవారుజామునే లైన్లు
- 500 మందిలో 200 మందికే యూరియా
- అన్నదాతల ఆందోళన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

యూరియా కోసం రైతులు తిప్పలు పడుతున్నారు. ఈ రోజన్నా దొరుకుతుందేమోనని ప్రతి రోజూ తెల్లవారే సరికే మండల కేంద్రాల్లో కార్యాలయాల ఎదుట లైన్ కడుతున్నారు. పనులు మానుకుని పొద్దంతా ఎదురు చూడగా.. యూరియా అందిన వారు సంతోషంగా ఇంటి దారి పడుతుండగా.. అందని వారు మళ్లీ ఎప్పుడొస్తుందోనని దిగాలు చెందుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాథమిక వ్యవసాయ పరపతి కార్యాలయం వద్దకు 550 బస్తాల యూరియా లారీ వచ్చింది. అప్పటికే కార్యాలయం వద్ద వందలాది మంది రైతులు బారులు తీరి ఉన్నారు. పోలీసులు పర్యవేక్షించారు. అధికారులు ప్రతి రైతుకూ రెండు యూరియా బస్తాలు ఇచ్చేందుకు టోకెన్లు పంపిణీ చేశారు. అయితే 200 మంది రైతులకు మాత్రమే యూరియా అందింది. అక్కడ మరో 300 మందికిపైగా రైతులు మిగిలిపోయారు. మెదక్ జిల్లా రామాయంపేట యూరియా దుకాణాల ముందు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి



యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

ఆధ్వర్యంలో బిఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. యూరియా కొరత, బ్లాక్ మార్కెటింగ్‌పై రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అన్నదాత ఆగ్రో సేవా కేంద్రం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. నర్సాపూర్ పట్టణంలోని వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా సరఫరా కేంద్రాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ సందర్శించి పరిశీలించారు.

వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని పిఎసిఎస్ ఫర్టిలైజర్ షాపుల వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బర్, జిఎస్.గోపి ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా గుంత కోడూరు గ్రామానికొచ్చిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి యూరియా అందడం లేదని రైతులు మొర పెట్టుకున్నారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రైతులు యూరియా కోసం బారులు తీరారు. పట్టణంలోని శ్రీనివాస ఫర్టిలైజర్ షాపు ఎదుట ఉదయం నుంచి క్యూ కట్టారు. ఒక్కొక్క రైతుకు మూడు బ్యాగుల చొప్పున ఫింగర్ ప్రింట్, ఆధార్ ఒటిపితో అందిస్తున్నారు.

చేనేతపై జిఎస్‌టి ఎత్తేయాలి

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు చిన్నారెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత రంగంపై జిఎస్‌టి ఎత్తేయాలని, వారసత్వ చేనేత సంస్కృతిని కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి కోరారు. శుక్రవారం ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన లేఖ రాశారు. తెలంగాణలో వ్యవసాయం తర్వాత చేనేత రంగంపైనే అధిక మంది ఉపాధి [illegible] తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఇదే విషయంపై సెంటర్ ఫర్ మానిటరింగ్ రూరల్ ఇండియన్ ఎకానమీ అధ్యక్షులు రాపోలు జైప్రకాష్ ఆయన్ను కోరుతూ రాసిన లేఖను జతపరిచారు. రానున్న జిఎస్టీ సమావేశంలో చేనేత రంగానికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సిపిఎస్ రద్దు కోసం నేడు నల్లబ్యాడ్జీలతో నిరసన

- ఆర్‌యుపిపిటిఎస్ అధ్యక్షులు నర్సిములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) రద్దు కోసం శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు విధులకు హాజరై భోజన విరామ సమయంలో నిరసన తెలపాలని ఆర్‌యుపిపిటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శానమోని నర్సిములు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ జిఒ నెంబర్ 28 ద్వారా రాష్ట్రంలో సిపిఎస్ అమలవుతున్నదని అన్నారు. ఈ జిఒను రద్దు చేయాల్సిన అవసరముందన్నారు. సిపిఎస్ రద్దుకోసం దశలవారీ పోరాటం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఆర్‌యుపిపిటిఎస్ గౌరవసలహాదారు గోపాల్, ప్రధాన కార్యదర్శి బి శశికుమార్ మాట్లాడుతూ సిపిఎస్ అంతం కోసం పనిచేయాలని చెప్పారు. రాష్ట్రంలో మిగిలిపోయిన భాషాపండితులకు కూడా త్వరలో అప్‌గ్రేడ్ కావాల్సివుందని వివరించారు. వచ్చేనెల ఒకటో తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యోగ జెఏసి చైర్మెన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలన్నారు.

మల్యాలలోనే హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు

- మంత్రి తుమ్మల హామీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా మల్యాలలో ఏర్పాటు చేయనున్న ఆర్టికల్చర్ యూనివర్సిటీని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ మొండి పట్టుదలతో మల్యాలలోనే తక్షణమే యూనివర్సిటీ ఏర్పాటుకు ఆదేశాలివ్వాలని సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముందు భీష్మించుకు కూర్చున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు తక్షణమే అదేశాలు జారీ చేయాలని మంత్రి తుమ్మలను కోరారు. దీనికి మంత్రి తుమ్మల స్పందిస్తూ మల్యాలలోనే కృషి విజ్ఞానిక కేంద్ర యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని రైతులు, గ్రామస్తులు ఎవరూ అపోహ చెందొద్దని హామీ ఇచ్చారు. ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులకు సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు.

న్యాయవాది ప్రతాపరెడ్డి మృతికి 'ఐలు' సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ సీనియర్ న్యాయవాది, సామాజిక కార్యకర్త కె ప్రతాప్‌రెడ్డి మృతికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తెలంగాణ రాష్ట్ర కమిటీ, హైదరాబాద్ జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాయి. 94 సంవత్సరాల వయసులో మరణించిన ఆయన గొప్ప మానవహక్కుల కార్యకర్త అని, న్యాయం, ప్రజాసేవ చేయడంలో రాజీపడలేదని ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు జి. విద్యాసాగర్, అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి కె పార్థసారథి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డి ప్రవీణ్, కార్యదర్శి సి రామచంద్రారెడ్డి తెలిపారు. మంచికి మారుపేరుగా నిలిచారని అభిప్రాయపడ్డారు. అనేక విద్యా సంస్థలలో భాగస్వామిగా విద్యాభివృద్ధికి ప్రతాపరెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా, ఉమ్మడి ఎపి హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికై పనిచేశారని వివరించారు. సోషలిజం, లౌకికవాదాన్ని సమర్థించారని తెలియజేశారు. ప్రతాపరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియేజేశారు. ఈ మేరకు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

25న తెలంగాణ క్యాబినెట్ భేటీ...

- స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 25న హైదరాబాద్‌లోని సచివాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్థానిక సంస్థల ఎన్నికలపై క్యాబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. మరోవైపు పంచాయతీ ఎన్నికల కోసం హైకోర్టు విధించిన గడువు సెప్టెంబరు 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ఎన్నికలపై క్యాబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముంది. శనివారం జరగనున్న టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఖరారు కానుంది. రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బిసిలకు 42 శాతం సీట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం జరగనున్న క్యాబినెట్ సమావేశంలో పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకుని రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించే వీలుంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక అంశంలో హైకోర్టు విచారణపై చర్చించి అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

వైద్య విద్యార్థులకు గుడ్ న్యూస్

- 1,623 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్య విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఆరోగ్యశాఖలో మరోసారి ఉద్యోగాల జాతర మొదలైంది. ఈ మేరకు శుక్రవారం 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేట్కసింది. ఇందులో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్స్‌లో 1,616, ఆర్టీసీ హాస్పిటల్‌లో ఏడు పోస్టులు ఉన్నాయి. దరఖాస్తులకు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ గడువు ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరగనుంది. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. మరోవైపు పల్లెలకు స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ కానున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు ఎనిమిది వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిన విషయం తెలిసిందే. మరో ఏడు వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

ఉద్యమిద్దాం.. పాత పెన్షన్ సాధిద్దాం

- ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)కు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని, పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను సాధిద్దామని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. వచ్చేనెల ఒకటో తేదీన పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే పెన్షన్ విద్రోహ దినం మహాధర్నాలో ప్రతి ఉపాధ్యాయుడూ పాల్గొనాలని కోరారు. అందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లో పిఆర్‌టియుటిఎస్ అధ్యక్షులు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డితో కలిసి ఆయన ఉపాధ్యాయులతో వినూత్నంగా ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల్లోని ఉపాధ్యాయులకు ఆయన ఫోన్ చేసి మహాధర్నా ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఉపాధ్యాయుడు పాత పెన్షన్ కోసం చేపట్టే మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. సిపిఎస్ రద్దు కోసం అనేక ఏండ్లుగా పోరాటం చేస్తున్నామనీ, ఈసారి టీచర్ల గళాన్ని గట్టిగా విన్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. పీఆర్టీయూటీఎస్ నేతలు వారి జిల్లా పరిధిలో ఉపాధ్యాయులతో ఇదే రకమైన అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నారని చెప్పారు. జిల్లా బాధ్యుల నుంచి ఫోన్లు అందుకున్న టీచర్లు ఇతర ఉపాధ్యాయులతో మహాధర్నా అవసరాన్ని వివరిస్తారని అన్నారు. గ్రామీణ స్థాయి ఉపాధ్యాయుల వరకూ ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని తీసుకెళ్లామని వివరించారు. వచ్చేనెల ఒకటో తేదీన జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

జలమండలిలో సరిపోని ఆదాయం

- రెవెన్యూ పెంపునకు కొత్త సంస్కరణలు
- అక్రమ కనెక్షన్లు, బకాయిలపై దృష్టి
- విజిలెన్స్ విభాగం కేసులు నమోదు
- అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పని, సేవలు బారెడు.. ఆదాయం మూరెడు అన్న చందంగా తయారైంది హైదరాబాద్ జలమండలి పరిస్థితి. నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న జలమండలి రెవెన్యూ పెంచడమే లక్ష్యంగా అధికారులు నూతన సంస్కరణలు ప్రవేశపెడుతున్నారు. బోర్డుకు వచ్చే ఆదాయం కొత్త ప్రాజెక్టులకు సరిపోవడం లేదు. కేవలం నీటి సరఫరా, సీవరేజ్ సేవల మెరుగుదలకు మాత్రమే ఉపయోగపడుతోంది. జీతభత్యాలు తదితర ఖర్చులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ క్రమంలో ఖర్చులు తగ్గించి, ఆదాయం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రభుత్వం అందిస్తున్న నెలకు 20 వేల లీటర్ల ఉచిత నీటి పథకానికి అర్హులు కాని వారు, ఉచిత నీటి పథకానికి నమోదు చేసుకోని వారి నుంచి నల్లా బిల్లులను, బకాయిలపై దృష్టి సారించారు. డొమెస్టిక్, నాన్ డొమెస్టిక్ కనెక్షన్లపై ఆరా తీస్తున్నారు. నష్టాల నుంచి గట్టెక్కేందుకు జలమండలి ఆదాయంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా రెవెన్యూ, ఐటీ విభాగాల్లో కొత్త సంస్కరణలను ప్రవేశపెట్టేందుకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో థీమ్ పార్క్‌లో రెవెన్యూ, ఐటి విభాగ అధికారులతో మేధోమథన సదస్సు నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అక్రమ నల్లా కనెక్షన్లపై ఆరా..

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో



నగరంలో తాగు నీటి సరఫరా జరుగుతోంది. దాదాపు 14లక్షలకుపైగా నల్లా కనెక్షన్ల ద్వారా ప్రతిరోజూ కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తరలించి, శుద్ధి చేసిన నీటిని జలమండలి ఇంటింటికీ అందజేస్తోంది. ప్రతి లీటర్ నీటిని తరలించి, శుద్ధి చేయడానికి దాదాపు రూ.48 ఖర్చు చేస్తోంది. ఎంతో విలువైన నీటిని వినియోగించాల్సిన బాధ్యత నగరవాసులపై ఉంది. కానీ కొందరు అక్రమంగా నల్లా కనెక్షన్లను వినియోగిస్తున్నారు. మరికొందరు మీటర్ లేకుండానే నీటిని ఉపయోగించుకుంటున్నారు. ఇంకొందరైతే ఏకంగా నల్లాకే మోటార్ పెట్టి తోడేస్తున్నారు. మరికొందరైతే స్థానిక నాయకులు, కార్పొరేట్ల అండతో అక్రమ నల్లా కనెక్షన్లు తీసుకుంటున్నారు. దాంతో జలమండలికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు జలమండలి విజిలెన్స్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేసింది.

వాణిజ్య కనెక్షన్లపై దృష్టి

డొమెస్టిక్ కేటగిరీ కింద ఉన్న వాణిజ్య కనెక్షన్లను గుర్తించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం జిహెచ్ఎంసి, ఒఆర్ఆర్ పరిధిలోని నాన్-రెసిడెన్షియల్ భవనాల జాబితా సేకరించి, వాటిని వాటర్ సప్లై కనెక్షన్లతో పోల్చనున్నారు. దాంతోపాటు అన్ని ఓ అండ్ ఎం, సెక్షన్ల వారీగా సరఫరా చేసే నీటి పరిమాణం, పైపు పరిమాణం, మీటర్‌ను బట్టి వివరాల నివేదికలు రూపొందిస్తారు. మీటర్ లేని కనెక్షన్లకు బిల్లింగ్ విధానం అమలు చేయాలని ఆలోచిస్తున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూళ్లు చేయాలని నిర్ణయించారు.

అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు

జిహెచ్ఎంసి పరిధిలోని నూతన భవన నిర్మాణదారులకు జలమండలి ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారు జిహెచ్ఎంసి అనుమతుల కోసం సమర్పించాల్సిన వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే ప్రక్రియను మరింత సులభతరం చేసి ఆన్‌లైన్‌లోనే పొందేలాగా సదుపాయాన్ని కల్పించింది. గ్రేటర్ పరిధిలో నూతన భవనం నిర్మించాలంటే జీహెచ్ఎంసీ అనుమతి తప్పనిసరి. ఆ పర్మిషన్ కోసం భవన యజమానులు విద్యుత్ ఫీజబిలిటీతో పాటు జలమండలి జారీ చేసే వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రం సమర్పించాలి. గతంలో ఈ సర్టిఫికెట్స్ పొందాలంటే జలమండలి సర్కిల్ కార్యాలయాల్లో, ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో సీజీఎం జారీ చేసేవారు. వివిధ కారణాల రీత్యా ఈ ప్రక్రియలో జాప్యం జరిగేది. ఆ ప్రక్రియను సులభతరం చేయడానికి ధ్రువపత్రాల జారీని ఆన్‌లైన్‌లోనే పొందేలాగా మార్పులు చేశారు.

బిసి విద్యార్థులకు పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


నిరసన తెలుపుతున్న ఆర్ కృష్ణయ్య తదితరులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిసి విద్యార్థుల స్కాలర్‌షిప్ కోసం ఒక్క పైసా కూడా ఇవ్వలేదని రాజ్యసభ సభ్యులు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. బిసి విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ బిసి నాయకులు వేముల రామకృష్ణ నాయకత్వంలో విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. వివిధ స్కీముల కోసం వేల కోట్ల రూపాయలు అప్పు చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. బిసి విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలకు మరో రూ.6000 కోట్లు అప్పు చేస్తే పోయేదేమున్నదని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్ బకాయిల కోసం బడ్జెట్‌లో రూ.5000 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయకుండా ఉద్దేశపూర్వకంగా లాప్స్ చేసిందని విమర్శించారు. పక్క రాష్ట్రమైన ఏపీలో స్కాలర్‌షిప్ బకాయిల నిమిత్తం రెండు దఫాలుగా రూ.1500 కోట్లు విడుదల చేశారని, మన రాష్ట్రంలో పైసా కూడా విడుదల చేయకుండా బిసి విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయని, కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్ ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని బిసి విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించి వారికి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.బిఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తున్న ప్రభుత్వం.. విద్యార్థుల ఫీజుబకాయిలు ఇవ్వడానికి మనసు రావడం లేదని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఫీజుబకాయిలు చెల్లించాలని, లేకపోతే మహా ఉద్యమం చేపట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బిసి నాయకులు గుజ్జ కృష్ణ, నీలా వెంకటేష్, నందగోపాల్, ప్రీతం రాఘవేందర్ పాల్గొన్నారు.

మహిళా పోలీసుల అభ్యున్నతికి కృషి

- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మహిళా పోలీసుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. గత మూడ్రోజులుగా ఆర్‌బివిఆర్ పోలీసు అకాడమీలో జరుగుతోన్న రాష్ట్ర మహిళా పోలీసు అధికారుల సదస్సు ముగింపు సభ శుక్రవారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అదుపులో మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది పాత్ర కూడా ఎనలేనిదని ఆయన అన్నారు. శాంతి భద్రతలు మొదలుకొని ట్రాఫిక్, ఇంటెలిజెన్స్, సీఐడీ, తదితర విభాగాల్లో వారు పురుషులతో సమానంగా పోటీ పడుతూ విధి నిర్వహణ సాగిస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ మూడ్రోజుల సదస్సులో మహిళా పోలీసుల పురోగతి, సంక్షేమానికి చేసిన సిఫారసులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి అమలుకు కృషి చేస్తుందని భట్టి తెలిపారు. మహిళా పోలీసు అనే పదానికి బదులు పోలీసు అనే పదాన్ని మాత్రమే వినియోగించాలనే సిఫారసును తప్పకుండా ప్రభుత్వం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన అన్నారు. పోలీసు శాఖలో రిక్రూట్‌మెంట్ అయ్యే సమయంలో లేని లింగ వివక్ష విధుల్లో చేరాక చూపటం ఏమాత్రమూ తగదని ఆయన స్పష్టం చేశారు. శాంతి భద్రతలు సవ్యంగా ఉన్నప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ గురుతర బాధ్యతను పోలీసు శాఖ నిర్వహిస్తున్నదని భట్టి చెప్పారు. దేశంలోనే విధి నిర్వహణలో రాష్ట్ర పోలీసు శాఖ మొదటి స్థానంలో ఉండటం అత్యంత గర్వనీయమని, ఈ ఖ్యాతి శాఖలోని ప్రతి ఒక్కరికీ దక్కుతుందని ఆయన తెలిపారు. శాంతిని కాపాడే పోలీసు శాఖను మరింత పటిష్టం చేయటానికి అవసరమైన వర్క్‌షాప్‌లు ప్రతి ఏటా నిర్వహించాలని డిప్యూటీ సిఎం అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మేలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారనీ, అందుకు పోలీసులు అందిస్తున్న సహకారం కూడా మంచి ఫలితాలనిస్తున్నదని ఆయన తెలిపారు. రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ రవి గుప్తా మాట్లాడుతూ.. మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు శాఖలో నిర్వహిస్తున్న విధి నిర్వహణ అత్యంత బాధ్యతాయుతంగా సాగుతున్నదని ప్రశంసించారు. రాష్ట్ర డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. గత మూడ్రోజులుగా మహిళా పోలీసుల సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, చేసిన సిఫారసులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. మహిళా పోలీసుల అభ్యున్నతి కోసం వేసిన ఐదు కమిటీలు చేసిన పలు సిఫారసులను ప్రభుత్వానికి పంపటం జరుగుతుందని, ఈ మూడ్రోజుల సదస్సు తాము ఆశించిన ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా ఐపీఎస్ అధికారులు శిఖా గోయెల్, సౌమ్యామిశ్రా, బాలనాగా దేవి, సాతిలక్రా, సుమతిలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 400 మంది మహిళా అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న మీనాక్షి నాటరాజన్

ఇంద్రవెల్లిలో మీనాక్షి నటరాజన్ పర్యటన

- సమాక గ్రామస్తులతో సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పథకాల అమలు తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించటానికి ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో పర్యటించారు. టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కతో కలిసి సమాక గ్రామస్తులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు సరైన సమయంలో అందుతున్నాయా లేదా అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలు అందని పలువురు గ్రామస్తులను వెంట తీసుకొని ఇంద్రవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పైలెట్ ప్రజావాణి బహిరంగ విచారణ వేదిక వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రజల తరపున మీనాక్షి నటరాజన్ టీం సభ్యులు గ్రామస్తుల సమస్యలను లిఖితపూర్వకంగా అధికారులకు అందజేశారు. ప్రతి ఒక్క సమస్యపై సమగ్రంగా విచారణ చేసి, తక్షణమే పరిష్కారం అయ్యేలా చూస్తామని అధికారులు చెప్పారు.

నేడు యుఎస్‌పిసి 'చలో హైదరాబాద్'

- విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) ఆధ్వర్యంలో శనివారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టింది. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శనివారం ఉదయం 11 గంటలకు మహాధర్నా చేపట్టనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినప్పటికీ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తుందని యుఎస్‌పిసి విమర్శిస్తోంది. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. నూతన జిల్లాలకు డిఇఒ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఇఒ, నూతన మండలాలకు ఎంఇఒ పోస్టులను మంజూరు చేయాలని కోరుతోంది. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచిస్తోంది. ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి వివిధ రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరింది. ప్రాథమిక పాఠశాలలకు 5,571 పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. డిఎడ్, బిఎడ్ అర్హతలున్న ప్రతి ఎస్జీటీకి పిఎస్‌హెచ్‌ఎం ఉద్యోగోన్నతులకు అవకాశం కల్పించాలని సూచించింది. పండితులు, పిఇటిల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తవడంతో 2,3,9,10 జిఒలను రద్దు చేసి 11,12 జీవోల ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరింది. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని తెలిపింది. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను విడుదల చేయాలని, 2023, జులై ఒకటి నుంచి పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేసింది. 25 జీవోను సవరించాలనీ, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లుండాలని సూచించింది. రూ.398 టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్‌ను మంజూరు చేయాలని తెలిపింది. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేయాలని సూచించింది. గురుకుల టైంటేబుల్‌ను సవరించాలని, కెజిబివి, మోడల్ స్కూళ్లు, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది

గో బ్యాక్...

- మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా బంద్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా శుక్రవారం పలు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఒయు జెఎసి పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ఆమనగల్, కడ్తాల్‌లో స్థానిక వ్యాపారులు బంద్ పాటించారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛందంగా తమ వ్యాపార సముదాయాలను బంద్ చేశారు. ఆమనగల్, కడ్తాల్ వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. 'గో బ్యాక్ మార్వాడీ, మార్వాడీ వద్దు-లోకల్ ముద్దు, మన ప్రాంతం-మన వ్యాపారం' అంటూ నినాదాలు చేశారు. ముందుగా మండల కేంద్రంలోని డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బంద్ నిర్వహిస్తున్న వర్తక సంఘం నాయకులను కడ్తాల్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు.నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలో స్థానిక వ్యాపారులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మర్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా పట్టణ సిమెంట్, ఐరన్ హార్డ్‌వేర్, శానిటరీ, పెయింట్స్, ప్లైవుడ్, శానిటరీ, ఎలక్ట్రికల్ వ్యాపార సంఘాల జెఎసి అధ్యక్షులు ఫిరోజ్, సోమ దయాకర్, వెంపటి నవీన్, భాగ్యశ్రీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దుకాణాల బంద్ నిర్వహించారు. పట్టణంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేశారు. తుంగతుర్తి మండల కేంద్రంలో 'మన ఊరు- మన దుకాణం' నినాదంతో మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా స్థానిక వ్యాపారులు నిరసన ర్యాలీ చేపట్టారు.



రోలర్ స్కేటింగ్‌లో తేజేష్‌కు స్వర్ణం

హైదరాబాద్ : కెఎల్‌హెచ్ బాచుపల్లి క్యాంపస్‌లో బిటెక్ చదువుతున్న పడిగ తేజేష్‌కు ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, రజత పథకాలు దక్కించుకున్నారని ఆ విద్యా సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఇటీవల దక్షిణ కొరియాలోని జెచియాన్‌లో జరిగిన 20వ ఆసియా రోలర్ స్కేటింగ్‌లో గ్రూపు ఈవెంట్‌లో ఒక స్వర్ణ పతకాన్ని, పెయిర్ స్కేటింగ్ అండ్ క్వార్టెట్ స్కేటింగ్‌లో రెండు రజత పథకాలను సాధించాడని పేర్కొంది. అన్ని రకాల ప్రతిభను ప్రోత్సాహానికి ఇది నిదర్శనమని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ పేర్కొన్నారు.



జూరాల 34 గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తోంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3 లక్షల 55 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు పిజెపి అధికారులు తెలిపారు. దాంతో జూరాల 34 గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.557 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 6.550 టిఎంసిల నీరు నిల్వ ఉంది.



ఖమ్మం జిల్లాలో భారీగా గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టేకులపల్లి మండలంలోని వెంకట్యాతండా రోడ్డు వద్ద సిసిఎస్, టేకులపల్లి పోలీసులు సంయుక్తంగా జరిపిన వాహనాల తనిఖీ సమయంలో భారీగా గంజాయిని పట్టుకున్నట్టు ఇల్లందు డిఎస్‌పి చంద్రభాను తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రూ.2 కోట్ల 12లక్షల 47వేల విలువగల.. 424 కేజీల 950 గ్రాముల గంజాయిని లారీలో తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో గంజాయిని కొలుగోలు చేసి భద్రాచలం, పాల్వంచ మీదుగా ఇల్లందు రోడ్డు మార్గం నుంచి రాజస్థాన్ తరలిస్తున్నారన్నారు. ఈ క్రమంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా లారీ క్యాబిన్ల, సీట్ల కింద గంజాయి బయటపడిందన్నారు. నిందితులు ప్రభులాల్ గుర్జర్, శివరాజ్ గుర్జర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. రాంబాబు, నారాయణ గుర్జర్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ ఎ రాజేందర్, బోడ్ ఎస్ఐ శ్రీకాంత్, సిసిఎస్ సిబ్బంది, సిఐ రమాకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో బ్రిటిష్ మహిళకు బేరియాట్రిక్ సర్జరీ

- 32 కిలోల బరువు తగ్గింది

ప్రజాశక్తి - హైదరాబాద్


బ్రిటిష్ మహిళ అలెగ్జాండ్రియా ఫాక్స్ (59) బరువు తగ్గేందుకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి కిమ్స్ ఆసుపత్రికి వచ్చి స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆమె బరువు 102 కిలోల నుంచి 70 కిలోలకు తగ్గిందని ఆ హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. ఈ ఆపరేషన్‌ను మెటబాలిక్, బేరియాట్రిక్ సర్జరీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ కేశవ్‌రెడ్డి మన్నూర్ చేశారు. ఆమెకు ఊబకాయం, అధిక రక్తపోటు, కిడ్నీ వైఫల్యం, థైరాయిడ్ సమస్యలు ఉన్నాయి. శస్త్రచికిత్స తర్వాత ఆమె త్వరగా కోలుకుని మూడు రోజుల్లో ఇంగ్లండ్ తిరిగి వెళ్తున్నారు. ఆమె భర్తకు 2023లో లండన్‌లో డాక్టర్ మన్నూర్ ఇదే శస్త్రచికిత్స చేశామని డాక్టర్ కేశవ రెడ్డి తెలిపారు. ఆమెకు ఊబకాయంతో పాటు అధిక రక్తపోటు, కిడ్నీ వైఫల్యం, థైరాయిడ్ లాంటి సమస్యలున్నాయి. దాంతో తన భర్తతో కలిసి హైదరాబాద్ వచ్చి చికిత్స చేయించుకున్నారన్నారు. శస్త్రచికిత్సతో ఉదరభాగంలో 2/3 వంతు తొలగించామన్నారు. దాంతో కడుపు చిన్నగా అయిపోయిందన్నారు.

కెన్‌స్టార్ నుంచి 5 స్టార్ ఎయిర్ కూలర్లు

హైదరాబాద్ : వచ్చే వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని కెన్‌స్టార్ ఇప్పటి నుంచే కొత్త ఉత్పత్తులపై దృష్టి పెట్టింది. తొలిసారి 5-స్టార్ బిఇఇ రేటెడ్ శక్తి సామర్థ్య ఎయిర్ కూలర్‌ల శ్రేణిని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. వీటిని ఐదేళ్ల వారంటీతో అందించనున్నామని కెన్‌స్టార్ సిఇఒ సునీల్ జైన్ తెలిపారు. ఇది ఇంధన ఆదాలో తమ అచంచలమైన నిబద్ధతకు నిదర్శనమన్నారు.

భూ నిర్వాసితులకు ఎకరానికి రూ.35 లక్షలు ఇవ్వాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


రైతులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ నిర్వాసితులకు ఎకరానికి రూ.35 లక్షల పరిహారమివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా పేరపళ్ల గ్రామంలో శుక్రవారం రైతులతో కలిసి జయమ్మ చెరువు వరకు ద్విచక్ర వాహనాల ర్యాలీ తీశారు. మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతలలో భాగంగా ఈ గ్రామంలో రైతులు భూములు కోల్పోతున్నారు. భూములు కోల్పోతున్న రైతులతో జాన్‌వెస్లీ చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తున్నట్టు చెబుతున్న ఈ జిల్లాకు చెందిన వ్యక్తి సిఎం రేవంత్‌రెడ్డి.. సొంత నియోజకవర్గంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.14లక్షల పరిహారమే ఇస్తామనడం అన్యాయమన్నారు. భూనిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. బలవంతపు సేకరణ చేయొద్దని, భూ నిర్వాసితుల సమ్మతి మేరకే భూములను సేకరించాలని అన్నారు. 40 రోజులుగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పష్టమైన పరిహారాన్ని ప్రకటించకపోవడం విడ్డురంగా ఉందన్నారు. పూర్వీకుల నుంచి వచ్చిన భూములను ఇప్పుడు మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో కోల్పోవాల్సి వస్తోందని, రైతులకు సరైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు సరైన పరిహారం ఇచ్చేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో 14 లక్షల రూపాయలకు ఎకరం భూమి ఎక్కడా రాదన్నారు. అందువల్ల సిఎం రైతులను ఆదుకోవాలని, సరైన పరిహారంతోపాటు నిర్వాసితుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా భూపరిహారం అందించాలని, అప్పుడే భూ నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు అన్నారు. భూ నిర్వాసితుల పక్షాన సిపిఎం చిత్తశుద్ధితో పోరాడుతుందని భరోసా ఇచ్చారు. భూములు కోల్పోతున్న వారికి సరైన పరిహారం ఇవ్వకుంటే మళ్లీ వలసలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఈ ప్రాంత వాసిగా ముఖ్యమంత్రి జిల్లా ప్రజలకు, రైతులకు సరైన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జి.వెంకట్రామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు మచ్చేందర్, ఉపాధ్యక్షులు ధర్మరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం, ఉపాధ్యక్షులు జోషి, నాయకులు సింగారం హనుమంతు, అంజి, అంజప్ప, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం కొత్త విధానం తేవాలి

- ప్రభుత్వానికి ఫెడరేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సమాజ సేవ చేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొత్త విధానం తేవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. కనీస వేతనాలు కూడా అందని పరిస్థితుల్లో జర్నలిస్టులు దుర్భర జీవనం గడుపుతున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య తెలిపారు. రాష్ట్రంలో వేలాది మంది జర్నలిస్టులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నారని చెప్పారు. ఇండ్లస్థలాలకు సంబంధించిన రీవ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉంటూ జర్నలిస్టులు ఎనలేని సేవలు అందిస్తున్నారని గతంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయూర్తి ఎన్‌వి రమణ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు, జడ్జీలు, ఐఎఎస్‌లు, ఐపీఎస్‌లతో జర్నలిస్టులను పోల్చడం ఎంతమాత్రం సబబుకాదని అభిప్రాయపడ్డారు. కనీస వేతనాలేగాక పింఛన్ సౌకర్యం అసలే లేదని గుర్తు చేశారు. ఈ విషయమై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టిసారించి జర్నలిస్టులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అవసరమని భావిస్తే మార్కెట్ ధర ప్రకారమైనా ఇండ్లస్థలాలు కేటాయించాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నకిలీ మద్యం తయారీ ముఠా పట్టివేత

- ఐదుగురు అరెస్టు.. రెండు కార్లు సీజ్
- నాలుగు లక్షల విలువైన నకిలీ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ కేంద్రంగా నకిలీ మద్యం తయారు చేస్తున్న ముఠాను మానుకోట పోలీసులు, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేసి రెండు కార్లు సీజ్ చేసి, నాలుగు లక్షల విలువైన నకిలీ మధ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మానుకోట టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్‌పి సుధీర్ రామనాథ్ కేక వివరాలు వెల్లడించారు. గార్ల మండలానికి చెందిన గ్రామ కార్యదర్శి ఓర్సు గోపాలకృష్ణ, జక్కుల రమేష్, వరంగల్‌కు చెందిన అల్లం రవీందర్, ములుగు రాజు, ఖమ్మం జిల్లా గోపాలపురానికి చెందిన ఆర్‌ఎంపి వైద్యులు షేక్ సాబీర్ భాషతో పాటు వరంగల్‌కు చెందిన రామ్‌తేజ, మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన ఆశిష్‌ఠాకూర్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. మహబూబాబాద్ జిల్లా కేంద్ర శివారు జ్యోతిబస్ నగర్ కాలనీ వద్ద ఒక గోదామును ఎలక్ట్రికల్ పరికరాల కోసం అద్దెకు తీసుకొని స్పిరిట్‌తో నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. దాన్ని అమ్మడానికి ప్రయత్నించగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఇందులో ఆశిష్ ఠాగూర్, రామ్‌తేజ పరారీలో ఉండగా.. ఐదుగురిని అరెస్టు చేశారు. వారి రెండు కార్లు సీజ్ చేసి నాలుగు లక్షల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో అల్లం రవీందర్ గతంలో మధ్యప్రదేశ్ నుంచి తక్కువ ధరకు మద్యం తీసుకొచ్చి వరంగల్‌లో ఎక్కువ ధరకు అమ్మేవాడు. అతనికి మహారాష్ట్రకు చెందిన మద్యం అక్రమ విక్రేత ఆశిష్ ఠాగూర్ పరిచయం అయ్యాడు. వీరికి ఖమ్మంకు చెందిన ఆర్‌ఎంపి డాక్టర్ షేక్ సాబీర్ భాష పరిచయం అయ్యాడు. ఆశిష్ ఠాకూర్‌తో కలిసి మద్యం తయారీకి సిద్ధమయ్యారు. ఇందులో ఆశిష్ ఠాకూర్‌కు లక్ష యాభై వేలు ఇచ్చి స్పిరిట్ కొనుగోలు చేశారు. ఆ తర్వాత వారికి వరంగల్‌కు చెందిన ములుగు రాజు, మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన ఓర్సు గోపాలకృష్ణ, జక్కుల రమేష్ పరిచయం అయ్యారు. వీరంతా ఆశిష్ ఠాగూర్ ద్వారా కొనుగోలు చేసిన స్పిరిట్‌తో నకిలీ మద్యం తయారీ చేశారు. ఇల్లెందు రోడ్‌లోని ఒక గోదాం నెలకు రూ.27 వేలకు అద్దెకు తీసుకుని 180 ఎమ్మెల్ బాటిల్ పరిమాణంలోని ప్లాస్టిక్ బాటిళ్లలో నకిలీ మద్యం నింపి సీల్ చేసి 'ఓల్డ్ అడ్మిరల్ స్పెషల్', 'విఎస్‌ఒపి బ్రాండీ' కంపెనీకి చెందిన నకిలీ స్టిక్కర్లు అంటించి విక్రయానికి అట్టపెట్టెల్లో సిద్ధం చేశారు. వరంగల్, ఖమ్మం జిల్లాలోని గ్రామాల్లో విక్రయించాలనుకున్నారు. ఓర్సు గోపాలకృష్ణ, జక్కుల రమేష్, సాబీర్ భాష రెండు కార్లలో వచ్చి సరుకు తీసుకుని వెళ్లడానికి సిద్ధంగా ఉండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఐదుగురిని అరెస్టు చేసి, రెండు కార్లు సీజ్ చేశారు. 2688 బాటిల్స్ నకిలీ మద్యం, 4,500 ఖాళీ బాటిల్స్, 60 లీటర్ల స్పిరిట్, రెండు వేల ఖాళీ బాటిల్ మూతలు, 1755 కంపెనీ స్టిక్కర్లు, 100 అట్టపెట్టెలు, రెండు ప్లాస్టిక్ డ్రమ్ములు, ప్లాస్టిక్ టబ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆ ఎమ్మెల్యే అదో టైపు!

- ఇందిరమ్మ ఇళ్లలో మితిమీరిన రాజకీయ జోక్యం
- ఆఫీసర్లపై అడ్డగోలు చిందులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆ ఎమ్మెల్యే తీరుపై నియోజకవర్గవ్యాప్తంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మితిమీరిన రాజకీయ జోక్యం చేసుకుంటున్నారనే ఆవేదన స్థానికంగా ఉంది. క్యాంప్ ఆఫీస్‌కు వచ్చి ఇందిరమ్మ ఇళ్లు కావాలంటే చాలు వెంటనే సంబంధిత వ్యక్తి ఆధార్ కార్డు జిరాక్స్‌పై సంతకం చేసి పంపుతున్నారు. ఇలా ఒక్కొక్కరి జిరాక్స్‌లపై మూడు, నాలుగు సార్లు సంతకం చేసి ఇచ్చినా ఎంపిడిఒ కార్యాలయాల్లో పని కావటం లేదు. సాంకేతిక కారణాలతో అధికారులు అర్జీలను తిరస్కరిస్తున్నారు. వాస్తవానికి ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా లబ్దిదారుల ఎంపిక జరగాలి. ఆ ప్రక్రియ కొనసాగుతుండగానే ఎమ్మెల్యే ఇష్టం వచ్చినట్టుగా జిరాక్స్‌లపై గ్రీన్ ఇంకుతో సంతకం చేసి పంపుతున్నారు. అర్జీదారులు అవి తీసుకెళ్లి అధికారులకు ఇస్తే సున్నితంగా తిరస్కరిస్తున్నారు. దీనిపై దరఖాస్తుదారులు, అధికారుల మధ్య పలు సందర్భాల్లో వాగ్వాదాలు నడుస్తున్నాయి. 'ఎమ్మెల్యే సంతకం చేశాక మీరెందుకు ఇవ్వరు' అని అధికారులను నిలదీస్తున్నారు. సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

బాల్ అధికారుల కోర్టులోకి నెట్టి..

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల బాల్‌ను అధికారుల కోర్టులోకి నెట్టి ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారు. 'తాంబూలాలు ఇచ్చాను.. తన్నుకు చావండి' అనే రీతిలో ఎమ్మెల్యే అడిగినోళ్లకల్లా సంతకాలు చేసి మంచివానిగా ముద్రవేసుకుంటున్నారు. కానీ ఎంపిడిఒ కార్యాలయాలకు వెళ్లేసరికి పని కాకపోవడంతో దరఖాస్తుదారులు కోపోద్రిక్తులవుతున్నారు. అధికారులపై ఆగ్రహం వెళ్లగక్కుతున్నారు. మరోవైపు అధికారపార్టీ నాయకులు కూడా ఆ ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలతో సంబంధం లేకుండా ఎమ్మెల్యే సంతకాలు చేసి ఇవ్వడమేంటని ఆయా గ్రామపంచాయతీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎమ్మెల్యే ఇలా వ్యవహరిస్తే గ్రామాల్లో తాము అబాసుపాలవుతామని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. 'ఎమ్మెల్యే మంచివారే కానీ తాము చెడ్డవారమనే' రీతిలో ప్రచారం జరిగితే స్థానిక ఎన్నికల జయాపజయాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలో ఎమ్మెల్యే తీరుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని ఆ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలోని ఈ ఏకైక ఎస్టీ సెగ్మెంట్లో మొత్తం ఐదు మండలాలు ఉండగా.. ఓ రెండు మండలాలపై ఎమ్మెల్యే శీతకన్ను వేస్తున్నారు. పలు సందర్భాల్లో ఆ రెండు మండలాలపై తాను దృష్టి సారించలేకపోతున్నానని ఆయనే సభాముఖంగా చెబుతూ వస్తుండటం గమనార్హం.

ఒక్కో వర్గంపై ఒక్కో తీరుగా..

ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నారు. ఆ ముగ్గురికి సంబంధించిన గ్రూపులు ఈ ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఉన్నాయి. ఓ మంత్రి అనుచరులు అధికంగా ఉన్నారు. అయినప్పటికీ ఆ మంత్రి గ్రూపుకు తగిన ప్రాధాన్యత లభించట్లేదు. దీనిపై వారు పలుమార్లు సంబంధిత మంత్రికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో తమ అనుచరులకు అన్యాయం జరుగుతోందని ఫిర్యాదు అందడంతో ఖమ్మంలోని ఆ మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి ఫోన్ చేసి ఎమ్మెల్యేకు సమాచారం ఇస్తున్నారు. 'వాళ్లను నా వద్దకు పంపండి.. ఏదైనా ఉంటే నేను చూసుకుంటా..' అని సమాధానం ఇస్తున్న ఎమ్మెల్యే ఉద్దేశపూర్వకంగా సంబంధిత అర్జీలనే పక్కన పెడుతున్నారనే చర్చ సాగుతోంది. ఎమ్మెల్యేకు విన్నవించినా పని కాకపోవడంతో ఆ మంత్రి అనుచరులు నేరుగా ఇన్‌చార్జి మినిస్టర్‌ను సంప్రదించారు. తమ గ్రామ ఇందిరమ్మ ఇళ్ల కమిటీని సైతం రద్దు చేయించారు. ఎమ్మెల్యేతో సంబంధం లేకుండానే కొత్త కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అర్హుల జాబితాను రూపొందించి నేరుగా ఎమ్మెల్యేకు పంపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎమ్మెల్యే ఆ లిస్టుకు ఆమోదం తెలపక తప్పలేదు. ఇందిరమ్మ ఇళ్లే కాదు.. వివిధ అంశాల్లో అధికార పార్టీ నాయకులను సమన్వయం చేయటంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమవుతున్నారనే చర్చ సాగుతోంది.

ఎమ్మెల్యే తనయుడి సెటిల్మెంట్లు

ఇప్పుడు ఎమ్మెల్యేకు తోడు ఆయన కుమారుడు రంగంలోకి దిగారు. పలు వివాదాస్పద అంశాల్లో తలదూర్చుతున్నారని తెలుస్తోంది. పెద్దమొత్తంలో ముడుపులు తీసుకొని భారీగా సెటిల్మెంట్లు చేస్తున్నట్టు నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. అధికారులతో చర్చించే అంశాలపైనా ఎమ్మెల్యేకు స్పష్టత ఉండటం లేదనే టాక్ సైతం ఉంది.

ఆఫీసర్లను క్యాంప్ కార్యాలయానికి పిలిపించుకొని గంటల తరబడి కూర్చొబెట్టుకుంటున్నారు. ఉదయాన్నే రమ్మని చెప్పి ఎమ్మెల్యే సాయంత్రం ఎప్పుడో వచ్చే వరకు అధికారులు వేచి ఉండాల్సి వస్తుండటంతో పని నిమిత్తం మండల ఆఫీసులకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చర్చించాల్సిన అంశాలపై కూడా ఎమ్మెల్యేకు అవగాహన లేకపోవడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలోనే అది తెలుస్తోంది. ఇటు పాలనాపరమైన అవగాహన లేకపోవటం.. అటు నాయకులు, అధికారుల మధ్య సమన్వయం చేయటంలో ఎమ్మెల్యే విఫలమవుతుండటం చర్చనీయాంశంగా మారింది.

యాప్‌లో ఆరు కోట్లు చూపించి.. కోటి స్వాహా

- ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో భారీ మోసం
- సైబర్ నేరస్తులకు సహకరిస్తున్న ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ తార్నాకకు చెందిన ఓ యువతిని సైబర్ నేరస్తులు బురిడీ కొట్టించారు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మీరు రూ.6కోట్లు సంపాదించారని నమ్మించి కోటి రూపాయలు స్వాహా చేశారు. శుక్రవారం ఎసిపి శివ మారుతీ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన అడ్డులపురి హర్షవర్ధన్, కొండూరు వేణు, మైలారం ప్రదీప్, పచ్చిపాల వినోద్ యాదవ్, వరసనబోయిన వంశీ, మంగలి లక్ష్మణ్ సైబర్ నేరస్తులతో చేతులు కలిపారు. సైబర్ నేరస్తులు చెల్లించే కమీషన్లకు ఆశపడి పనిచేశారు. ఆరుగురు కలిసి మోసాలకు తెరలేపారు. తాము చెప్పిన విధంగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలొస్తాయని అమాయకులను నమ్మించి మోసం చేస్తున్నారు. తద్వారా వచ్చిన డబ్బులను వీరి బ్యాంక్ అకౌంట్‌లో వేసుకుని విదేశాల్లో వున్న చిన్‌చాన్‌కు హవాలా ద్వారా పంపిస్తున్నారు. ఇదే తరహాలో తార్నాకకు చెందిన ఓ యువతిని టార్గెట్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, వాట్సప్ ద్వారా సంప్రదించారు. ఎస్ఎస్‌డిసిఎక్స్ సంస్థకు చెందిన అధికారులమని నమ్మించారు. ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేయాలని నకిలీ లింక్‌లు పంపించారు. బాధితురాలు పెట్టిన పెట్టుబడులకు లాభాలు చూపించి ప్రోత్సహించారు. మొదట్లో ఆమెకు రివార్డులు, కమీషన్లు, లాభాల పేరుతో డబ్బులను జమచేసి నమ్మించారు. ఆ తర్వాత కోటి రూపాయల వరకు పెట్టుబడి పేరుతో ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. రూ.6కోట్లు లాభం వచ్చిందని ఆన్‌లైన్‌లో చూపించారు. అయితే వాటిని ఆమె విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించడంతో రాలేదు. మరికొంత డబ్బులు పెట్టుబడి పెడితే మొత్తం డబ్బులు బదిలీ చేసుకోవచ్చని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. వారి మాటలను నమ్మిన బాధితురాలు ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు రూ.1,05,03,752 వివిధ అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసింది. తీరా మోసపోయినట్టు గుర్తించిన బాధితురాలు హైదరాబాద్ సిసిఎస్‌లో ఫిర్యాదు చేసింది. డిసిపి డి.కవిత ఆదేశాలతో ఎసిపి శివమారుతీ, జైపాల్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎం.సీతారాములు విచారణ చేపట్టారు. ఎస్ఐలు ఏ.శ్రీకాంత్, కానిస్టేబుల్స్ శ్రీకాంత్, ప్రతాప్ కలిసి ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 15డెబిట్ కార్డ్స్, మూడు పాస్‌బుక్స్, చెక్‌బుక్కుతో పాటు 8 సెల్‌ఫోన్లు, ప్రింటింగ్ మిషన్, స్కానర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే స్పందించొద్దని ఎసిపి సూచించారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు సోషల్‌మీడియాలో వచ్చే లింక్స్ క్లిక్ చేయొద్దని చెప్పారు.

జర్నలిస్టులపై దేశద్రోహం కేసు

- ఫెడరేషన్ ఖండన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ద వైర్ సంపాదకులు, సీనియర్ జర్నలిస్టు సిద్ధార్థ్ వరదరాజన్, మరో సీనియర్ జర్నలిస్టు కరణ్‌థాపర్‌పై అసోం ప్రభుత్వం దేశద్రోహం కేసు నమోదుచేయడాన్ని టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కమిటీ ఖండించింది. అపరేషన్ సింధూర్‌పై రాసిన ఆర్టికల్‌కుగాను అసోం ప్రభుత్వం అక్రమ కేసు బనాయించిందని చెప్పారు. ఒకవేళ వ్యాసంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రెస్‌కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకుంటే సరిపోయేదని అభిప్రాయపడింది. అలా కాకుండా ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియాను బెదిరించేందుకు పోలీస్ వ్యవస్థను వాడుకోవడం ఎంతమాత్రం సహించరానిదని స్పష్టం చేసింది. అయితే సిద్ధార్త్ వరదరాజన్, కరణ్‌థాపర్‌పై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోరాదని సుప్రీంకోర్టు ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రభుత్వ బడుల్లో కంబైండ్ స్టడీస్..!

- తొమ్మిదో తరగతి నుంచే విద్యార్థుల గ్రేడింగ్
- పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం కసరత్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో కంబైండ్ స్టడీస్‌కు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా తొమ్మిదో తరగతి నుంచే విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టి.. కంబైండ్ స్టడీస్ కార్యాచరణ అమలుకు ప్లాన్ చేస్తోంది. ముఖ్యంగా విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, ఒత్తిడి తగ్గింపు, వేగవంతమైన అభ్యాసం, పరస్పర సహకారంతో అనుమానాల నివృత్తి, సమస్యల పరిష్కారం, పోటీతత్వం పెంచేందుకుకు కంబైండ్ స్టడీస్ దోహదపడుతుందని యోచిస్తోంది. రోజూ క్లాస్ రూమ్‌లో కంబైండ్ స్టడీస్‌కు ప్రోత్సహించే విధంగా విద్యాశాఖ అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. పరీక్షల సమయంలోనే కాకుండా నిత్యం గ్రూప్‌గా చదువుకోవడంతో మంచి ఫలితాలు సాధించొచ్చని విద్యాశాఖ ఆలోచిస్తోంది. ఎవరికివారే చదువుకోవడం కంటే సమూహంగా స్నేహితులతో కలిసి స్టడీస్ చేయడం వల్ల ఏకాగ్రత పెరగడంతోపాటు ఒత్తిడి తగ్గిస్తుంది. అంతేగాక ఒకరికి వచ్చిన సందేహాలను మరొకరు నివృత్తి చేసుకునే అవకాశం ఉండటం.. చదువుకున్న విషయాలు గుర్తుంచుకోవడానికి సహాయపడటంతోపాటు ఒకరికొకరు సహాయం చేసుకోవడం ద్వారా చదువులో రాణించొచ్చని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఈ సరికొత్త ప్రయోగానికి రెడీ అయింది.

గ్రేడింగ్ ఇలా..!

పదో తరగతి విద్యార్థులతో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను బట్టి గ్రేడింగ్ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. నిజానికి గ్రేడింగ్ చేయడం ద్వారా వారి విద్యా అవసరాలను ముందుగానే గుర్తించొచ్చని యోచిస్తోంది. విద్యార్థులను ఎ,బి,సి గ్రేడ్లుగా విభజించి.. అందులో బీ, సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే విధంగా తగిన కార్యాచరణ రూపొందిస్తోంది. వారి నైపుణ్యాలను మెరుగుపరిచి ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. అంతేగాక విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను బట్టి చదువులో ముగ్గురిని కలిపి ఒక గ్రూపుగా ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టారు.

స్పెషల్ క్లాసులు

తొమ్మిదో తరగతి విద్యార్థుల గ్రేడింగ్‌పై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచనల మేరకు ఇటీవల డీఈవో రోహిణి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి, తొమ్మిదో తరగతి విద్యార్థులను ఎ,బి,సి గ్రేడ్‌లుగా విభజించాలని ఆదేశించారు. వివిధ సబ్జెక్టులలో సి,బి గ్రేడ్ విద్యార్థుల లోపాలను గుర్తించాలని ఆదేశించడంతోపాటు వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.

తొమ్మిదో తరగతి నుంచే గ్రేడింగ్.. ఆర్ రోహిణి, డిఇఒ, హైదరాబాద్

పదో తరగతి విద్యార్థులతో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థులను గ్రేడింగ్ చేసి కంబైండ్ స్టడీస్‌కు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. ఈ పద్ధతితో వెనుకబడిన విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచడంతో పాటు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం.

హెచ్‌ఆర్‌సి రక్త పరీక్షతో కేన్సర్ ముందస్తు గుర్తింపు

- ఆరీట్ హాస్పిటల్‌లో ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్



కేన్సర్‌ను ముందుగానే గుర్తించే (ఎర్లీ కేన్సర్ అసెస్మెంట్) హెచ్‌ఆర్‌సి పరీక్షను హైదరాబాద్‌లో తొలిసారి అందుబాటులోకి తెచ్చామని ఆరీట్ హాస్పిటల్స్ అంకాలజీ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కరణ్ రెడ్డి పాలకొండ తెలిపారు. ఈ పరీక్ష ట్యూమర్ ఏర్పడకముందే కేన్సర్ ముప్పును 12-18 నెలల ముందు గుర్తిస్తుందన్నారు. కేన్సర్ నిరోధక వైద్యంలో విప్లవాత్మక మార్పును తేనుందన్నారు. దీన్ని ఎపిజెరెస్ భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చామన్నారు. దీని ప్రారంభోత్సవానికి నటీ జయసుధ, ఆరీట్ హాస్పిటల్స్ ప్రివెంటివ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ప్రణతి కేసరా, ఎపిజెనరెస్ బయోటెక్ ఆపరేషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమన్ గుర్వాడ హాజరయ్యారు.

వీడిన బాలిక హత్యకేసు మిస్టరీ

- నిందితుడు పదో తరగతి విద్యార్థి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో సంచలనం సృష్టించిన పదేళ్ల బాలిక సహస్ర హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు పదో తరగతి విద్యార్థిగా తేలింది. బాలానగర్ జోన్ డిసిపి సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపిన పోలీసులు.. మృతురాలి తమ్ముడి స్నేహితుడైన బాలుడే నిందితుడని తేల్చారు. సంగీత్ నగర్‌లోని రావుస్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న నిందితుడు చోరీ కోసం బాలిక ఇంట్లోకి వెళ్లినట్టు తెలుస్తోంది. బాలిక గమనించడంతో ఆమెను హత్య చేసినట్టు సమాచారం. అయితే, మృతురాలి తమ్ముడి వద్ద ఉన్న ఎంఆర్‌ఎఫ్ క్రికెట్ బ్యాట్ కోసం వచ్చి హత్య చేసి ఉండొచ్చని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. బ్యాట్ అడిగితే ఇవ్వలేదన్న కక్షతోనే ఈ నేరానికి పాల్పడ్డాడని సమాచారం. దర్యాప్తులో భాగంగా నిందితుడి వద్ద ఒక లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో దొంగతనం చేయాలని, ఎవరైనా అడ్డొస్తే చంపేయాలని క్రూరమైన ప్రణాళిక రాసుకున్నట్టు తెలుస్తోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

'మిషన్ డన్' పేరుతో బాలుడి లెటర్

'మిషన్ డన్' పేరుతో నిందితుడు తన చోరీ ప్లాన్‌ను పేపర్‌పై ఇంగ్లీష్‌లో రాసుకున్నాడు. అందుకు సంబంధించిన పేపర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఆ లెటర్‌లో ఏముందంటే.. "ముందుగా ఇంట్లోకి వెళ్లాలి. ఇంట్లో ఉన్న గ్యాస్, టేబుల్‌ని డోర్ వద్ద పెట్టాలి. ఇంటికి వేసిన లాక్‌ను గ్యాస్‌పై కాల్చాలి. ఆ తరువాత లాక్‌ను కట్ చేయాలి. లాక్‌ను కట్ చేసిన తరువాత డబ్బులు తీసుకోవాలి. ఆ తరువాత ఇంటికి లాక్ వేయాలి. ఆ తరువాత గ్యాస్‌ను పాత ప్రదేశంలో పెట్టి లీక్ చేయాలి. ఆ ఇంటి నుంచి బయటకు వచ్చి లాక్ వేయాలి" అని వచ్చీరాని ఇంగ్లీషులో రాశాడు. చివరిలో గ్యాస్ లీక్ చేయడం ద్వారా.. ఆ ఇల్లు ధ్వంసం అవుతుందని.. ఆ తర్వాత ప్రూఫ్‌లు కానీ.. మరే విషయం కూడా బయటకు రాదని అతను స్కెచ్ వేసినట్టు తెలుస్తోంది.

ఎసిబి వలలో వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో లంచం వ్యవహారం బహిర్గతమైంది. ఓ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం లక్ష రూపాయలు డిమాండ్ చేసిన సబ్ రిజిస్ట్రార్ ఏసీబీ వలలో చిక్కారు. వివరాల్లోకెళ్తే.. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్‌లోని 200 గజాల స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో ఓ వ్యక్తినిసబ్ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ లక్ష రూపాయలు డిమాండ్ చేయగా.. చివరికి రూ. 70 వేలకు ఒప్పందం జరిగింది. ఆ తర్వాత బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎసిబి డిఎస్‌పి ఆనంద్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సోదాలు నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ సూచన మేరకు బాధితుడు రూ.70 వేలను డాక్యుమెంట్ రైటర్ వద్ద టైపిస్టుగా పనిచేస్తున్న రమేష్‌కు అందించగా.. ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రమేష్‌ను ప్రశ్నించగా.. తనకు ఎలాంటి సంబంధమూ లేదని, సబ్ రిజిస్ట్రార్ సూచన మేరకే డబ్బులు తీసుకున్నానని అంగీకరించాడు. వెంటనే ఇద్దరినీ ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎసిబి కోర్టులో హాజరుపర్చనున్నారు. గతంలో కూడా ఈ సబ్ రిజిస్ట్రార్‌పై ఎన్నో ఫిర్యాదులు వచ్చాయని, తగిన సాక్షాలు లేకపోవటంతో చర్యలు తీసుకోలేదని ఏసీబీ అధికారులు తెలిపారు. ఎవరైనా లంచం కోసం డిమాండ్ చేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీఎస్పీ సూచించారు.